వైభవంగా రాజగోపురం శిఖర ప్రతిష్ఠాపన


గణపతిహోమం చేస్తున్న పండితులు

మల్కాజిగిరి: నేరెడ్‌మెట్‌లో పురాతన అన్నపూర్ణ సహిత కాశీవిశ్వనాథాలయం నూతన రాజగోపురం శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్ష దారణ, యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతి హోమం ప్రారంభమయ్యాయి. నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠతో పాటు ఆలయంలో సతీసమేతనవగ్రహ ప్రతిష్ఠాపన కూడా జరుగుతుందన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ


గౌతంనగర్‌లో నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

గౌతంనగర్: బ్రాహ్మణ సేవా వాహిని (బీఎస్‌వీ) ఆధ్వర్యంలో శనివారం గౌతంనగర్‌లోని జయగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సమాజ సేవకులు వెంపటి లక్ష్మీనారాయణ శర్మ, శివరామకృష్ణలు హాజరై నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. బీఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు, గ్రేటర్ అధ్యక్షులు వేదుల శ్రీనివాస్, కన్వీనర్ నీలంరాజు మధు, మహిళ ఉపాధ్యక్షురాలు ప్రభ, ఆలయ చైర్మన్ బాలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. చంద్రకళా నిలయం పేరిణి, ఆంధ్ర నాట్యగురువు సంతోష్ పెరుమాండ్ల శిష్యబృందంచే ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్లోకం, పుష్పాంజలి, దేవి కై వారం, నారాయణతేనమో, నమో మూషికవాహన, ఇదిగో భద్రాద్రి, తిల్లాన, మహాగణపతిమ్, దశావతారం తదితర అంశాలు కృతికారెడ్డి, మనోజ్ఞ, వైష్ణవి, అక్షర, ప్రవస్తి, సంజన, హరణి, మధుప్రియ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

అధిక రక్తపోటుతో జాగ్రత్త !

కాప్రా: మానవాళికి హైపర్ టెన్షన్ చాలా ప్రమాదకరమని, ఇది ఓ రకంగా 'సైలెంట్ కిల్లర్' అని మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఉమాగౌరి అన్నారు. వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలోని కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేగంగా మారుతున్న జీవనశైలితో మన శరీరం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు.

వయస్సుతో సంబంధం లేకుండా..

ఉద్యోగం, వ్యాపారం, ఇతర పనుల్లో నిమగ్నమై చాలామంది ఆరోగ్యంపై దృష్టి సారించకపోవడంతో వయస్సుతో సంబంధం లేకుండా చాలామంది అధిక రక్తపోటుకు గురౌతున్నారన్నారు. ప్రజలను ఎక్కువగా వెంటాడే వ్యాధుల్లో అధిక రక్తపోటు కూడా ఒకటని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి


కుషాయిగూడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి ఏటా మే 17న 'వరల్డ్ హైపర్‌టెన్షన్ డే' నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు.

30 దాటితే చెక్ చేయించుకోవాల్సిందే..

30 ఏళ్లు దాటిన వారంతా రెగ్యులర్‌గా బీపీని చెక్ చేయించుకోవాలని, ప్రతిరోజు కనీసం 40 నిమిషాల పాటు వాకింగ్ చేయాలని సూచించారు. ఈ ఏడాది 'మేజర్ యువర్ బ్లడ్ ప్రెషర్ ఆక్యురేట్లీ కంట్రోలింగ్ అండ్ లీవ్‌లాంగ్' అనే థీమ్ డబ్ల్యూహెచ్‌ఓ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గీత, డాక్టర్ శ్రీదేవి, కౌశిక్, డాక్టర్ వినోద్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రమాదేవి, డాక్టర్ సుప్రియ, ఎన్సీడీ ప్రోగ్రామ్ సిబ్బంది ఉమాపతి, వైద్య సిబ్బంది శ్యామ్‌సుందర్, స్టాఫ్ నర్సులు సుశీల, కవిత, రాహుల్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు

ఆహారంపై శ్రద్ధ తీసుకోవాలి

మారిన జీవనశైలిలో మనం తీసుకునే ఆహారంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. భోజనంలో ఉప్పు తగ్గించడంతో పాటు ఉప్పు ఎక్కువగా ఉండే ఫాస్ట్‌ఫుడ్, పచ్చళ్లు, స్నాక్స్ వంటివి తీసుకోకూడదు. కాల్షియం, పొటాషియం ఉండే పాలు, పాలపదార్థాలు, పండ్లతో పాటు ఆకుకూరలు, మిల్లెట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. 40 ఏళ్లు వచ్చినవారంతా 8 గంటల నుంచి 9 గంటల పాటు నిద్ర ఉండేలా చూసుకోవాలి. మంచి నిద్ర ఉంటే అధిక రక్తపోటును దూరం చేసుకోవచ్చు.

– మల్లీశ్వరి,
ఎన్సీడీ ప్రోగ్రామ్ జిల్లా అధికారిణి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మల్కాజిగిరి: అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సర్కిల్ డీసీని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో యూజీడీ నిర్వహణ, ఏర్పాటు మున్సిపల్ విభాగం పరిధిలో ఉన్నప్పుడు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేవన్నారు. జలమండలి నిర్వహణకు వెళ్లిన తర్వాతే ఇబ్బందులు వచ్చాయన్నారు. యూజీడీ లీకేజీలను పట్టించుకోకపోవడంతో మురుగు రోడ్లపై పారుతుందని, ప్రజలు కూడా ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ఏళ్ల తరబడి కొత్త పెన్షన్లు మంజూరు కావడం లేదని, ఇప్పటికే ఉన్న పెన్షన్‌దారులకు కూడా పెన్షన్ అందడం లేదన్నారు. అధికారులు ప్రజా సమస్యపై దృష్టి సారించాలని కోరామన్నారు.


డీసీతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలో రూ.32 లక్షలతో రజక సేవా సంఘం కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే అధికారులు కాంట్రాక్టర్లపై తీవ్ర చర్యలు తప్పవన్నారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, రజక సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి దానయ్య, పోసాని పవన్, జిత్తు, శంభులింగం పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ గౌతమీపైప్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నాచారం ఐడీఏ రోడ్డు నెంబర్, 01,16లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11కేవీ బాలాజీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు నాచారం ఐడీఏ రోడ్డు నెంబర్ 12,15 జీవీకే లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం మత్తులో భార్యతో గొడవపడి...

ఉప్పల్: మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన ఎద్దుల కిషోర్ (36) భార్య గౌతమితో పాటు ఉప్పల్ బీరప్పగడ్డ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. కిషోర్ వృత్తి రీత్యా డ్రైవర్. గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసై భార్యతో గొడవలు పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కూడా అదే విధంగా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడటంతో ఆమె బీరప్పగడ్డలో నివాసముంటున్న కిషోర్ సోదరుడి ఇంటికి పిల్లల్ని తీసుకొని వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడతో భార్యకు ఫోన్ చేసి 'నేను చచ్చిపోతున్నా' అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఈ లోపు కిషోర్ సోదరుడు ఎసోబు, భార్య గౌతమి వెంటనే అక్కడికి చేరుకున్నారు. తలుపులు కొట్టినా తీయక పోవడంతో బద్దలు కొట్టి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.


కిషోర్ (ఫైల్)

అభివృద్ధి పనుల పరిశీలన

అల్వాల్: అల్వాల్ డివిజన్ రాంనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను శనివారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కును త్వరలోనే అభివృద్ధి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. చిన్న పిల్లలకు ఆటపరికరాలు, వాకింగ్‌ట్రాక్ నిర్మిస్తామని, హార్టికల్చర్ సహకారంతో పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఈఈ శ్రీకాంతి, డీఈ ప్రశాంతి, ఏఈ వరుణ్‌దేవ్, సాజిద్, కాలనీవాసులు బాలసుబ్రహ్మణ్యం, రాజశేఖర్, రాఘవరెడ్డి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మల్కాజిగిరి: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోతినగర్‌కు చెందిన మసం లక్ష్మి స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తుంది. 16న రాత్రి ఆమె కుమార్తె నీలిమ ఫోన్ చేసి ఇంటి వద్ద సోదరుడు సందీప్ (35) ఆత్మహత్య చేసుకున్నాడని తల్లికి చెప్పింది. ఆమె వెంటనే తాను పనిచేసే ఆసుపత్రికి తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. సందీప్ గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసేవాడని, కొన్ని నెలలుగా ఉద్యోగం లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివిజన్ అభివృద్ధికి రూ.5 కోట్ల ఎంపీ నిధులు

మౌలాలి : డివిజన్ అభివృద్ధికి ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి రూ. 5 కోట్లు కేటాయించినట్లు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి సీనియర్ బీజేపీ నాయకుడు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను శనివారం కలిసి ఎంపీ ఈటల రాజేందర్ ఉత్తర్వు లేఖను అందజేశారు. మౌలాలి ప్రధాన రహదారులతో పాటు మారుతీనగర్ మెయిన్‌రోడ్డు, పీబీ కాలనీ, జేబీఆర్ స్కూల్ తదితర 11 ప్రాంతాల్లో సీసీరోడ్ల ఏర్పాటుకు ఎంపీ ఈటల రాజేందర్ నిధులు కేటాయించినట్లు చంద్రశేఖర్‌యాదవ్ పేర్కొన్నారు.



'సెంకోకై కరాటే' కి గ్లోబల్ గుర్తింపు

ఉప్పల్: భారత తొలి అంతర్జాతీయ కరాటే శైలి 'సెంకోకై కరాటే' కి 10 ప్రత్యేక కాటాలపై గ్లోబల్ గుర్తింపు లభించిందని సెంకోకై కరాటే స్థాపకుడు హాన్షి. డా.శశ్వత్‌కుమార్ శనివారం ప్రకటన విడుదల చేశారు. దేశంలో తయారైన కాటాలు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ 10 కాటాలు సంప్రదాయ యుద్ధకళ ఆత్మరక్షణకు అనుకూలమైన ప్రాక్టికల్ టెక్నిక్స్, ఆధునిక పోరాటశైలిని కలగలిపిందన్నారు. ఈ గ్లోబల్ గుర్తింపు ద్వారా ప్రపంచ యుద్ధ కళలరంగంలో భారత్ ఎదుగుతున్న స్థానం స్పష్టమవుతోందన్నారు. దేశీయ యద్ధకళలపై విశ్వాసాన్ని పెంపొందించడానికి గ్లోబల్ గుర్తింపు గొప్ప ప్రేరణ కలిగిస్తుందని పేర్కొన్నారు.



దశల వారీగా సమస్యల పరిష్కారం

అల్వాల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని దశల వారీగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముందుకెళ్తున్నారని కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితాఅనిల్‌కిషోర్‌లు అన్నారు. శనివారం అల్వాల్ డివిజన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సంక్షేమంతో పాటు ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే పాటుపడుతున్నారని, అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే సహించేది లేదు

ఉప్పల్: ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించి షెడ్‌లు వేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని, ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు అన్నారు. స్థానికంగా వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని శనివారం ఉప్పల్ బీరప్పగడ్డ నుంచి చిలుకానగర్ నాలా వరకు రోడ్లను ఆక్రమించి షెడ్‌లను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఇప్పటికైనా రోడ్లు, ఫుట్‌పాత్‌లపైకి వేసుకున్న షెడ్‌లను వెంటనే తొలగించుకోవాలని లేదంటే తొలగిస్తామని హెచ్చరించారు.

తిరంగా ర్యాలీకి తరలిన బీజేపీ నేతలు

అల్వాల్: 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని స్మరించుకుంటూ.. సైనికుల త్యాగం, వీరత్వాన్ని గుర్తు చేసుకుంటూ.. నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే తిరంగా ర్యాలీకి శనివారం మచ్చబొల్లారం డివిజన్ నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. నాయకులు అజయ్‌రెడ్డి, మాచర్ల శ్రీనివాస్, కరుణశ్రీ, ఉదయ్‌ప్రకాష్, రమాకాంత్, దేవి, వినయ్‌శంకర్, మహేష్‌రాజ్, యుగేందర్, అనిల్‌రాజ్, సుజాత, పద్మిని, రాజురెడ్డి, ప్రదీప్, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అల్వాల్: నేరెడ్‌మెట్ డివిజన్ బాలాజీకాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న కాలనీరోడ్డుకు అనుమతి తీసుకొచ్చి సీసీరోడ్డు వేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాయకులు ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఆదిత్య, సుధ, సత్యనారాయణ, రాజిరెడ్డి, శ్యామ్, సాయి, పరాస్‌జైన్, నవీన్, ప్రసన్న, మల్లిక, పంకజం, ధనలక్ష్మి, కృష్ణకుమారి, వనజ, శాలిని, శైలజ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని..

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

అల్వాల్: సెల్‌ఫోన్ అధికంగా వాడుతున్నాడని, తండ్రి మందలించడంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్ సూర్యనగర్‌లో నివసించే మంగలి శివరాం కుమారుడు పాపయ్య (16) ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఎక్కువసేపు ఫోన్‌తో గడుపుతుండటంతో తండ్రి మందలించి బాగా చదువుకోవాలన్నారు. ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తండ్రి మాట్లాడటం మానేశాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు ఈనెల 16న సాయంత్రం ఇంటిపైన రేకులకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.